



సాలూరు: మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి శుభాకాంక్షలు చెబుతున్న చిన్నారులు

ఊరూరా.. కృష్ణాష్టమి

- గోపిక, కృష్ణుల వేషధారణల్లో చిన్నారులు
- ఉట్టికొట్టేందుకు యువత పోటీ



గుమ్మలక్ష్మీపురంలో ఉట్టికొడుతున్న చిన్నారులు



సాలూరు రూరల్: గోపిక, కృష్ణుని వేషధారణల్లో చిన్నారులు



పాలకొండ: నక్కలపేటలో ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు



మక్కువ: యాదవ వీధిలో యువత కేరింతలు

జిల్లా వ్యాప్తంగా సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే ఇళ్లలో శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి ఇష్టమైన వంటలు, మిఠాయిలను నైవేద్యంగా సమర్పించారు. చిన్నారులను గోపిక, కృష్ణుడిగా ముస్తాబు చేసి తల్లిదండ్రులు మురిసి పోయారు. పలుచోట్ల ఉట్టి కొట్టే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉట్టి కొట్టేందుకు యువత, చిన్నారులు పోటీపడ్డారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలను సమర్పించారు. మహిళలు సామూహిక పూజలు చేశారు. దీంతో జిల్లా అంతటా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.

-ఆంధ్రజ్యోతి బృందం



మక్కువ: పుష్పాలంకరణలో శ్రీకృష్ణుడు

ఇదెలా సాధ్యం?

బయట మార్కెట్‌లో కేజీ బీరకాయలు రూ.50 పలుకుతుంటే వారు మాత్రం రూపాయికే అందిస్తారంట. కిలో అల్లం మార్కెట్‌లో రూ.100కు అమ్ముతుంటే దాన్ని కూడా రూపాయికే సరఫరా చేస్తారంట. ఈ రెండే కాదు బీట్‌రూట్, కాలీఫ్లవర్, చిక్కుడు కాయలు, పచ్చిమిర్చి, ముల్లంగి, వంకాయలు, అరటి, క్యారెట్ ఇలా చాలా కూరగాయలను కిలో రూపాయికే ఐటీడీఏ గురుకులాలకు సరఫరా చేస్తామని కొందరు వ్యక్తులు టెండర్లు వేసి కాంట్రాక్టులను దక్కించుకున్నారు. మార్కెట్‌లో కూరగాయల ధరలు మండిపోతుంటే వీరు మాత్రం తక్కువ రేటుకు ఇస్తామనడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నాశిరకం కూరగాయలను సరఫరా చేసి దోచుకోవడానికే వీరంతా సిండికేట్‌గా మారి ఒక ధరను నిర్ణయించుకొని కోట్ చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

- కిలో బీరకాయలు, బీట్‌రూట్, చిక్కుడు రూపాయికే ఇస్తారంట
- అల్లం, పచ్చిమిర్చి, క్యారెట్ కూడా..
- వసతి గృహాలకు కూరగాయల సరఫరా టెండర్లలో అవకతవకలు
- సిండికేట్ ముసుగులో దోపిడీకి యత్నం
- చూసీచూడనట్లు వదిలేసిన అధికారులు



సీతంపేట బాలికల గురుకుల పాఠశాల



(సీతంపేట రూరల్)

సీతంపేట ఐటీడీఏ పరిధిలో గురుకుల పాఠశాలలు, కళాశాలలు, మినీ గురుకులాలు 12 ఉన్నాయి. సుమారు 8 వేల మంది విద్యార్థులు గురుకుల వసతిగృహాల్లో ఉంటూ చదువుకుంటున్నారు. వీరందరికీ మెనూ ప్రకారం నాణ్యమైన కూరలతో భోజనం పెట్టాల్సి ఉంది. గురుకుల సొసైటీ ఆదేశాల మేరకు బయట మార్కెట్‌లో ఎటువంటి సరుకులను కొనుగోలు చేయడానికి వీలులేదు. అంతా టెండర్ల రూపంలోనే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. పసుపు, చింతపండు, కారం ఇతర నిత్యావసరాలు అన్ని గిరిజన సహకార సంస్థ ద్వారా గురుకులాలకు సరఫరా అవుతాయి. కేవలం కూరగాయల సరఫరాకు మాత్రమే ప్రతి ఏటా ఐటీడీఏ పీవో ఆధ్వర్యంలో టెండర్లను నిర్వహించి ఖరారు చేస్తారు. ఈ ఏడాదికి సంబంధించి ఈ నెల 21న సీతంపేట ఐటీడీఏలో ఇన్‌చార్జి పీవో వీవీ రమణ, డీడీ అన్నదొర ఆధ్వర్యంలో కూరగాయల టెండర్ల ప్రక్రియ నిర్వహించారు. ఈ టెండర్ల ప్రక్రియలో 10 మంది వరకు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. అయితే, గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది అత్యధిక రేట్లకు ఈ టెండర్లను దక్కించుకున్నారు. వీరంతా సిండికేట్‌గా మారి ఒక ధరను నిర్ణయించుకొని కోట్ చేసినట్లు తెలిసింది. నిబంధనల ప్రకారం ఎవరైతే అందరి కంటే తక్కువ ధరకు కూరగాయలు సరఫరా చేస్తారో వారికే ఈ టెండర్లను ఖరారు చేయాల్సి ఉంది. కానీ, ఈ ఏడాది మాత్రం కాంట్రాక్టర్లంతా ఒక్కటై ఒక్కొక్క పాఠశాలను పంచుకొని టెండర్లు వేశారు. దీనిలో భాగంగా అల్లం, పచ్చిమిర్చి, గోంగూర, మునగ, బీట్‌రూట్, క్యారెటు, పాలకూర, మెంతుకూర, ముల్లంగి, గుత్తి వంకాయ, చిక్కుడు వంటి కూరగాయలను కిలో రూపాయికే ఇస్తామని టెండర్లలో కోట్ చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఒక్కొక్క కాంట్రాక్టరు ఒక్కొక్క గురుకుల పాఠశాలకు 22 రకాల కూరగాయలను సరఫరా చేసేందుకు రూ.175 నుంచి రూ.230 వరకు మాత్రమే కోట్ చేయడం గమనార్హం. బయట మార్కెట్‌లో కూరగాయల ధరలు మండిపోతున్న తరుణంలో వీరు కారు చౌకగా టెండర్లు వేసి నాశిరకం కూరగాయలను సరఫరా చేయడానికి తెరతీశారనే విమర్శలు ఉన్నాయి. గతంలో కూడా ఇదే తరహాలో కొంత మంది వ్యాపారులు అధికారుల అండదండలతో టెండర్లను దక్కించుకొని సక్రమంగా కూరగాయలు సరఫరా చేయకుండా నాశిరకం అంటగట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి.

అధికారులకు తెలియదా?

ఐటీడీఏలో ఇటీవల నిర్వహించిన టెండర్ ప్రక్రియలో ఉన్నతాధికారులు పాల్గొన్నారు. టెండర్‌దారులు కోట్ చేసే ధరలను వీరు క్షుణ్ణంగా పరిశీలించారు. మొత్తం 22 రకాల కూరగాయలను రూ.175 నుంచి రూ.230కే సరఫరా చేసేందుకు పలువురి కాంట్రాక్టర్లకు టెండర్లను ఖరారు చేశారు. వీరు సరఫరా చేస్తామన్న బీరకాయలు, బీట్‌రూట్, కాలీఫ్లవర్, చిక్కుడు కాయలు, అల్లం పచ్చిమిర్చి, ముల్లంగి, వంకాయలు, అరటి, క్యారెట్ బహిరంగ మార్కెట్‌లో అత్యధిక ధర పలుకుతున్నాయి. కానీ, వాటిని రూ.1కే సరఫరా చేస్తామంటే అధికారులు ఎలా నమ్మారో అర్థంకావడం లేదు. దీని వెనుక ఉన్న ఆంతర్యం ఏంటో వారికే ఎరుక. ఈ టెండర్ల నిర్వహణపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

బహిరంగ మార్కెట్‌లో ధరలు..

బహిరంగ మార్కెట్‌లో కేజీల లెక్కన కాయగూరల ధరలు పరిశీలిస్తే.. అల్లం రూ.100, బీట్‌రూట్ రూ.70, ముల్లంగి రూ.60, క్యారెట్ రూ.60, పచ్చిమిర్చి రూ.90, గుత్తి వంకాయ రూ.60, మునక్కాయలు రూ.60, వంకాయలు రూ.50 వరకు పలుకుతున్నాయి. ఈ నేపథ్యంలో టెండర్‌దారులు రూ.1కే వాటిని ఎలా పంపిణీ చేస్తారనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఈ టెండర్ల ప్రక్రియపై జిల్లా స్థాయి ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బ్లాక్ లిస్ట్‌లో పెడతాం..

టెండర్లను దక్కించుకున్న వారు గురుకులాల వసతి గృహాలకు నాశిరకం కూరగాయలు సరఫరా చేస్తే క్షమించేది లేదు. అటువంటి వారిని బ్లాక్‌లిస్ట్‌లో పెడతాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన కూరగాయలను సరఫరా చేయాలి. దీన్ని ప్రత్యేకంగా పర్యవేక్షిస్తాం.

-అన్నదొర, డీడీ, గిరిజన సంక్షేమ శాఖ

జిల్లాలో విద్యా ప్రమాణాలు పెరగాలి

- ప్రత్యేక అధికారులు పాఠశాలలను సందర్శించాలి
- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



కలెక్టర్ శ్యాంప్రసాద్

పార్వతీపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అధికారులు పాఠశాలలను విధిగా సందర్శించాలని కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా విద్యా వ్యవస్థలో ప్రమాణాలు గణనీయంగా పెరగాలని ఆయన పేర్కొన్నారు. 'షైన్స్కూల్ షై ఫ్రెండ్ కార్యక్రమం కింద ఉన్నత పాఠశాలలకు జిల్లా స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించాం. వీరంతా వారంలో కనీసం రెండు రోజులు పాఠశాలలను సందర్శించాలి. బోధన, విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, పుస్తకాలు, పాఠశాలల పరిసరాలు, మా బడి, మాతోట వంటి కార్యక్రమాలను పరిశీలించాలి. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించాలి. వారు ఏ అంశాల్లో వెనుకబడి ఉన్నారో గుర్తించాలి. అందులో వారు మెరుగైన ఫలితాలు సాధించడానికి అవసరమైన అన్ని సూచనలు, సలహాలు ఇవ్వాలి. ప్రతి విద్యార్థి మంచి ప్రామాణికతతో మార్కులు సాధించాలి. ఉన్నత ఉద్యోగ, వ్యాపార అవకాశాలను గూర్చి సూచనలు, సలహాలు అందించాలి. ఐఐటీ, ఐఐఎం, క్లాట్ తదితర జాతీయ స్థాయి విద్యా సంస్థల ప్రవేశాల వివరాలను వారికి తెలియజేయాలి. గత రెండు సంవత్సరాలుగా పదో తరగతి పరీక్షల్లో రాష్ట్రంలోనే పార్వతీపురం మన్యం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. అదే స్థానాన్ని నిలపడానికి ప్రత్యేక అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృషి చేయాలి.' అని కలెక్టర్ పేర్కొన్నారు.



నిలిచిపోయిన గిరిజన ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణాలు

బిల్లులు చెల్లించక.. పనులు జరగక

- నిలిచిన గిరిజన ఇంజనీరింగ్ కళాశాల భవన నిర్మాణాలు
- గత ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

పార్వతీపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా జిల్లాలో గిరిజన ఇంజనీరింగ్ కళాశాల భవన నిర్మాణాలు నిలిచిపోయాయి. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించపోవడంతో పనులు అర్ధాంతరంగా ఆపేశాడు. దీంతో తరగతులు ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. 2021 జూన్‌లో కురుపాం వద్ద గిరిజన ఇంజనీరింగ్ కళాశాల పనులు ప్రారంభించారు. రెండేళ్లలో భవన నిర్మాణాలు పూర్తి చేసి తరగతులు ప్రారంభిస్తామని అప్పటి ప్రభుత్వం గొప్పలు చెప్పింది. ఈ మేరకు రూ.120 కోట్లతో పనులు ప్రారంభించారు. విద్యార్థుల వసతి గృహాల కోసం రెండు బ్లాకులు, తరగతులు, ల్యాబ్ కోసం మరో బ్లాక్ నిర్మించాల్సి ఉంది. తొలుత ఈ పనులు శరవేగంగా జరిగాయి. ఆ తరువాత కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు మందగించాయి. చివరకు పనులను పూర్తిగా ఆపేసి కాంట్రాక్టర్ వెళ్లిపోయాడు. దీనివల్ల గిరిజన ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు తరగతులు ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కళాశాల భవనం పూర్తి చేస్తుందని జిల్లా ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

త్వరగా పూర్తిచేస్తాం..

సుమారు రూ.10 కోట్ల పైబడి కాంట్రాక్టర్‌కు బిల్లులు పెండింగ్ ఉన్నాయి. బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయడం లేదు. త్వరగా పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

-వంశీకృష్ణ, జూనియర్ ఇంజనీర్



ఏనుగులకు మరొకరు బలి

- అరటి తోటలో పనిచేస్తున్న రైతుపై దాడి
- అక్కడికక్కడే మృతి చెందిన వైనం
- వన్నాంలో విషాదం



వాన శివుడు (ఫైల్)

కొమరాడ, ఆగస్టు 26: గజరాజులు జిల్లా ప్రజల ప్రాణాలు తీసేస్తున్నాయి. ఇప్పటికే వాటి దాడుల్లో పదుల సంఖ్యలో రైతులు మృతి చెందారు. తాజాగా, ఓ రైతుపై దాడి చేసి ప్రాణాలు తీశాయి. కొమరాడ మండలం వన్నాం గ్రామానికి చెందిన వాన శివుడు (60) అనే రైతు సోమవారం ఏనుగుల దాడిలో మృతి చెందాడు. స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. శివుడు తన అరటి తోటలో కలుపు నివారణ పనులు చేపట్టేందుకు సోమవారం మధ్యాహ్నం వెళ్లాడు. ఆ సమయంలో ఏనుగుల గుంపు ఆయనపై దాడి చేశాయి. కాళ్లతో తొక్కేయడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమీప ప్రాంతంలో ఉన్న కొందరు రైతులు చూసి గ్రామస్థులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి ఎస్‌ఐ నీలకంఠం చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శివుడు కుటుంబాన్ని ఆదుకుంటాం..

శివుడు తాను పెంచుకున్న కుమారుడు పోలినాయుడు వద్ద ఉంటున్నాడు. భార్య కొన్నేళ్ల కిందట చనిపోయింది. వ్యవసాయంతో పాటు కూలి పనులు చేసుకుంటూ కుమారుడితో కలిసి జీవిస్తున్నాడు. అయితే, కలుపు నివారణ పనులు చేపట్టేందుకు వెళ్లిన ఆయన ఏనుగుల దాడిలో మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి. శివుడు కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే జగదీశ్వరి తెలిపారు. ఏనుగుల సమస్య పరిష్కారం కోసం ఇప్పటికే ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిని కలిసినట్లు చెప్పారు. ఏనుగులను ఈ ప్రాంతం నుంచి తరలించడానికి తనవంతు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. శివుడు కుటుంబాన్ని టీడీపీ మండల కన్వీనర్ శేఖరపాత్రుడు, వన్నాం సర్పంచ్ విజయలక్ష్మి, తదితరులు పరామర్శించారు.

ఇంకెంతమంది చావాలి..

జిల్లాలో గజరాజులు ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఏజెన్సీ, మైదాన ప్రాంతాలు అనే తేడాలేకుండా పంటలతో పాటు ఆస్తి, ప్రాణ నష్టాన్ని కలిగిస్తున్నాయి. బాధిత కుటుంబాలకు తీవ్ర ఆవేదనను మిగుల్చుతున్నాయి. జియ్యమ్మవలస మండలం నుంచి కొమరాడ మండలం గుణానపురం గ్రామ సమీపంలోకి 2018 సెప్టెంబరులో గజరాజుల గుంపు వచ్చింది. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 12 మంది ఏనుగుల దాడిలో మృతి చెందారు. వీరిలో కొమరాడ మండలానికి చెందిన రైతులే ఆరుగురు ఉన్నారు. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నా ప్రభుత్వం గాని, అధికారులు గాని తక్షణ చర్యలు చేపట్టకపోవడంపై జిల్లా వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంకెన్ని ప్రాణాలు పోవాలని ప్రశ్నిస్తున్నారు.



అరటి తోటలో శివుడు మృతదేహం

ఉమ్మడి పౌరస్మృతి 'ఒకే దేశం - ఒకే చట్టం'

ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం



గ్రూప్-1 మెయిన్స్ ప్రత్యేకం

ఇండియన్ పాలిటీ

(నిన్నటి దిక్సూచి తరువాయి)

ఉమ్మడి పౌరస్మృతి-చారిత్రక పరిణామం
(రాజ్యాంగ పరిషత్ నుంచి 17వ లోక్‌సభ వరకు)

★ ఉమ్మడి పౌరస్మృతి అనే అంశం మన దేశానికి స్వాతంత్ర్యం రాకముం దు నుంచే చర్చనీయాంశంగా ఉంది. ఆనాటి కాలంలో హిందూ మహిళలకు విడాకులు తీసుకునే హక్కు ఉండేది కాదు. దాంతో ఉమ్మడి పౌరస్మృతి తేవాలనే డిమాండ్ తొలుత అఖిలభారత మహిళా కాన్ఫరెన్స్ నుంచి వచ్చింది. దీంతో రాజ్యాంగ కమిటీ విస్తృతంగా చర్చించింది. రాజ్యాంగ నిర్ణయసభలో సభ్యునిగా ఉన్న నజీరుద్దీన్ అహ్మద్ ఉమ్మడి పౌరస్మృతి కోసం డిమాండ్ చేశారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వంలోని సబ్ కమిటీ ఉమ్మడి పౌరస్మృతిని ప్రాథమిక హక్కుల్లో చేర్చాలా వద్దా అనే అంశంపై ఓటింగ్ నిర్వహించింది. 5-4 ఓట్ల తేడాతో అది వీగిపోయింది. దాంతో ఉమ్మడి పౌరస్మృతిని ప్రాథమిక హక్కులకు బదులుగా ఆదేశిక సూత్రాల్లో చేర్చారు. తదనంతర కాలంలో నెహ్రూ 'ఆధునిక పౌరస్మృతి' పేరిట కొత్త చట్టం తేవాలని ప్రయత్నించారు. కొన్ని వర్గాలు వ్యతిరేకించడంతో ఈ ప్రయత్నమూ ముందుకు సాగలేదు. 1964లో 'ముస్లిం పర్సనల్ లా'పై ఢిల్లీలో ఒక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దేశ, విదేశీ ప్రతినిధులు పాల్గొని విస్తృతంగా చర్చించారు. ఉమ్మడి పౌరస్మృతి అమలుకే మెజార్టీ సభ్యులు మొగ్గు చూపారు. మరోవైపు 1985లో షాబానో, 1995లో సరళా ముద్గల్ కేసుల్లో యూనిఫాం సివిల్ కోడ్(యూసీసీ)ను అమలు చేయాల్సిన అవసరం ఉన్నదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

★ ఇదే అంశంపై 2018లో 21వ లా కమిషన్ ఒక నివేదికను సమర్పించింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఉమ్మడి పౌరస్మృతి అవసరం లేదని ఆ నివేదికలో పేర్కొంది. మరోవైపు 2023 జూలై 3న పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్ సుశీల్ మోదీ యూనిఫాం సివిల్ కోడ్(యూసీసీ) నుంచి గిరిజన తెగలను మినహాయించాలని సిఫార్సు చేశారు. ప్రస్తుతం 22వ లా కమిషన్ దీనిపై అధ్యయనం కొనసాగిస్తుంది.

★ ఈ విధంగా ఉమ్మడి పౌరస్మృతికి సంబంధించి అనేక చర్చలు, వాదోపవాదాలు ముందుకు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో మన రాజ్యాంగంలోని నిబంధనలు ఉమ్మడి పౌరస్మృతికి సంబంధించి ఏం చెబుతున్నాయనే ఆసక్తి సహజంగానే అందరిలో కలుగుతుంది. ఇందుకు సామాజిక, రాజకీయ ఆసక్తులు ప్రధా న కారణం కావచ్చు. లేదా అనేక సందర్భాల్లో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు మరో కారణం కావచ్చు. 22వ లా కమిషన్ ఈ అంశంపై విస్తృత అధ్యయనం చేస్తుండడంతో.... గతంలో 21వ లా కమిషన్ చెప్పిన దానికి భిన్నంగా ప్రకటించే అవకాశముందా అనే సంశయం; ఉత్తరాఖండ్ రాష్ట్రం ఉమ్మడి పౌరస్మృతిపై చేసిన చట్టం రాజ్యాంగంలోని 44వ ఆర్టికల్‌పై దృష్టి సారించేలా చేసింది.

★ **ఆర్టికల్ 44:** 'The state shall endeavour to secure the citizen a uniform civil code through the territory of India'. దీని అర్థం 'భారతదేశంలోని పౌరులందరికీ ఒకేవిధమైన పౌరస్మృతిని తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నించాలి. ఇక్కడ మనం గుర్తించాల్సింది ఏమంటే ఈ వ్యాఖ్యల్లో యూనిఫాం(ఒకేవిధమైన) అనే పదం ఉంది. కామన్(ఉమ్మడి) అనే పదం లేదు. ఇండీవియర్- ప్రయత్నం, షల్ సెక్యూర్ అని కాకుండా 'షల్ ఇండీవియర్ టు సెక్యూర్' ఉండటాన్ని మనం గమనించాలి.

★ వ్యక్తిగత జీవితంలో అనుసరించాల్సిన ధర్మాల గురించి అన్ని మతాలు పేర్కొంటున్నాయి. ఆ మేరకు వ్యక్తిగత చట్టాలనూ అవి రూపొందించుకుంటున్నాయి. వీటిలో వివాహం, విడాకులు, వారసత్వం, దత్తత, పిల్లల సంరక్షణ గురించిన చట్టాలు ముఖ్యమైనవి. భారతీయ సమాజంలో ఉన్న భిన్న రీతుల నేపథ్యంలో భిన్న వ్యక్తిగత చట్టాలు రూపుదిద్దుకున్నాయి. వీటితో పాటు నాగరిక జీవనానికి దూరంగా ఉన్న ఆదివాసి(గిరిజనులు)ల సాంస్కృతిక, సామాజిక జీవనానికి నష్టం కలగని రీతిలో తీసుకొచ్చిన ప్రత్యేక చట్టాలు కూడా ఉన్నాయి. మరోవైపు గిరిజన ప్రాంతాల పరిపాలన నిమిత్తం రాజ్యాంగంలోని 5వ, 6వ షెడ్యూళ్లలో కొన్ని అంశాలను ప్రస్తావించారు. వీటి ప్రకారం ప్రత్యేక ప్రాంతాల్లో నివసించే గిరిజనుల వివాహ, విడాకుల, వారసత్వం... వంటి సాంఘిక ఆచారాలపై చట్టాలు చేసే అధికారాలను ఆయా జిల్లా మండళ్లు, ప్రాంతీయ మండళ్లకు కల్పించారు. అదే విధంగా గిరిజనుల మత, సాంఘిక, ఆచార, కట్టుబాట్ల విషయంలో నాగాలాండ్‌కు సంబంధించి ఆర్టికల్ 371ఏను, సిక్కింకు సంబంధించి ఆర్టికల్ 371ఎఫ్, మిజోరాంకు సంబంధించి 371జీను మన రాజ్యాంగంలో ప్రత్యేకంగా చేర్చారు.

★ ఈ సందర్భంగా ఇక్కడ మరో విషయాన్ని కూడా చెప్పుకోవాలి. అమలులో ఉన్న 'హిందూ మ్యారేజెస్ యాక్ట్ 1955; హిందూ సక్సేషన్, మైనారిటీస్, గార్డియన్‌షిప్ యాక్ట్ 1956; అడాప్షన్స్ అండ్ మెయింటెనెన్స్ యాక్ట్ 1956ల్లోని కొన్ని నిబంధనలను మార్చాల్సిన అవసరం ఉందని కొంత మంది పేర్కొంటున్నారు. ఉదాహరణకు కొడుకులతో సమానంగా కుమార్తెలకు సమాన ఆస్తిహక్కులు కల్పించడం, గృహహింస నుంచి మహిళలకు రక్షణ చట్టం(2005); బాల్య వివాహాల రద్దు చట్టం(2006); తల్లిదండ్రుల సీనియర్ పౌరుల పోషణ చట్టం(2007) అనే మూడు వ్యక్తిగత చట్టాలను సవరించడం ఆహ్వానించదగ్గ విషయం. ఇంకా మరికొన్ని వ్యక్తిగత చట్టాలకు సవరణలు తీసుకురావాల్సిన అవసరం ఉంది. అయితే భారతదేశ వైవిధ్య సంస్కృతిని కాపాడుకుంటూ వ్యక్తిగత చట్టాలను సవరించాలి.



డాక్టర్ సుంకర రమాదేవి,
అసిస్టెంట్ ప్రొఫెసర్

దిక్సూచి

ఏపీ కాలేజ్ ఆఫ్ జర్నలిజంలో కోర్సులు

హైదరాబాద్‌లోని ఏపీ కాలేజ్ ఆఫ్ జర్నలిజం(ఏపీసీజే)- వివిధ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు ఉన్నాయి. రెగ్యులర్, దూరవిద్య విధానాల్లో కోర్సులు చేయవచ్చు. ఆన్‌లైన్ మోడ్‌లో తరగతులు నిర్వహిస్తారు. తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాలు ఎంచుకోవచ్చు.

పీజీ డిప్లొమా ఇన్ జర్నలిజం: కోర్సు వ్యవధి ఏడాది. డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమా ఇన్ జర్నలిజం: కోర్సు వ్యవధి ఆర్నెల్లు. డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమా ఇన్ టీవీ జర్నలిజం: కోర్సు వ్యవధి ఆర్నెల్లు. డిగ్రీ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు.

సర్టిఫికెట్ కోర్స్ ఆఫ్ జర్నలిజం: కోర్సు వ్యవధి మూడు నెలలు. పదోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

- **ప్రాస్పెక్టస్, దరఖాస్తు ఫారం పొందేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 2
- **ఆన్‌లైన్ అడ్మిషన్ పొందేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 6
- **మొబైల్ నెం:** 98485 12767, 72860 13388
- **వెబ్‌సైట్:** www.apcj.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/3Y60EZ7లో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

40 రోజులు వైజాగ్‌లోనే...



సినీ నటుడు, తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ సోమవారం నగరానికి విచ్చేశారు. మధ్యాహ్నం 1.30 గంటలకు చెన్నై-విశాఖ విమానంలో ఇక్కడకు చేరుకున్న ఆయన నగరంలోకి వెళ్లారు. కాగా విమానాశ్రయంలో రజనీకాంత్ కనిపించడంతో పలువురు తమ సెల్‌ఫోన్‌లతో ఫొటోలు, వీడియోలు తీశారు. ఆయన ప్రస్తుతం నటిస్తున్న 'కూలీ' చిత్రం షూటింగ్ 40 రోజులపాటు నగరంలోని ఫిషింగ్ హార్బర్, తదితర ప్రాంతాల్లో జరగనున్నట్టు తెలిసింది.

గోపాలపట్నం (విశాఖపట్నం)

నటుడు దర్శన్‌కు జైల్లో రాచమర్యాదలు



హత్య కేసులో నిందితుడిగా ఉన్న కన్నడ సినీనటుడు దర్శన్‌కు కర్ణాటకలోని పరప్పన అగ్రహార జైల్లో రాచమర్యాదలు అందుతున్న ఫొటో, వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. రిమాండ్ ఖైదీగా ఉన్న దర్శన్‌తోపాటు మరో ముగ్గురు జైలు ఆవరణలోని ఒక పచ్చిక మైదానంలో ప్లాస్టిక్ కుర్చీల్లో కూర్చొని జల్సాగా గడుపుతున్నట్టు ఆ ఫొటోలో ఉంది. దర్శన్ ఒక చేతిలో కాఫీ కప్పు, మరో చేతిలో సిగరెట్ ఉన్నాయి. దర్శన్ ఎదురుగా ఆయన మేనేజర్‌తోపాటు ఈ కేసులో సహనిందితులుగా ఉన్న రౌడీషీటర్లు విల్సన్ గార్డెన్ నాగ, కుల్ల సీన కూర్చుని ఉన్నారు. జైల్లో ఖైదీలకు రాచమర్యాదలు అందుతున్నాయని విమర్శలు వెల్లువెత్తడంతో కర్ణాటక ప్రభుత్వం ఘటనపై విచారణకు ఆదేశించింది. ఏడుగురు జైలు అధికారులను సస్పెండ్ చేసింది.

కొంప ముంచిన వీడియోకాల్

రౌడీషీటర్ జానీ అలియాస్ జనార్దన్ కుమారుడు సత్య మే 7న మార్కెట్ ధర్మ అనే రౌడీషీటర్‌కు వీడియో కాల్ చేశాడు. తన సెల్ పక్కనే నటుడు దర్శన్ ఉన్నాడని చూపించి.. దర్శన్‌తో హాయ్ చెప్పించాడు. ఈ వీడియోను రికార్డు చేసుకున్న సత్య.. తన దర్జాను చాటుకునేందుకు కలాసిపాళ్యలోని కొందరికి షేర్ చేశాడు. అదే దర్శన్ కొంప ముంచింది. మరోవైపు సత్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

అభిమాని కుటుంబానికి మెగా సత్కారం



మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా ఆయన అభిమాని ఈశ్వరయ్య తిరుపతి నుంచి తిరుమల కొండ వరకూ పొర్లు దండాలు పెట్టుకుంటూ వెళ్లి తన అభిమానాన్ని చాటుకున్నారు. ఈ విషయం చిరంజీవికి తెలిసి ఈశ్వరయ్యను, ఆయన కుటుంబ సభ్యులను హైదరాబాద్‌కు ప్రత్యేకంగా పిలిపించి, ఇంట్లో బట్టలు పెట్టి సత్కరించారు. ఈశ్వరయ్య కుటుంబానికి తను అండగా ఉంటానని మెగాస్టార్ మాట ఇచ్చారు. గతంలో కూడా ఈశ్వరయ్య తిరుపతి నుంచి హైదరాబాద్‌లోని మెగాస్టార్ ఇంటి వరకూ సైకిల్ యాత్ర నిర్వహించారు.

హీరోయిన్‌ను చూసి హీరో ఉరుకులు, పరుగులు



'హుషారు' చిత్రంతో ప్రేక్షకులను మెప్పించిన యువ కథానాయకుడు తేజస్ కంచర్ల నటించిన తాజా చిత్రం 'ఉరుకు పటేలా'. వివేక్ రెడ్డి దర్శకత్వంలో కంచర్ల బాల భాను నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబర్ 7న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను సోమవారం విడుదల చేవారు. ఈ సినిమా గురించి వివరిస్తూ 'పెళ్లి వయసు వచ్చినా హీరోకి పెళ్లి కాదు. కారణం అతనికి చదువు అబ్బలేదు. కానీ బాగా చదువుకున్న పిల్లనే పెళ్లి చేసుకోవాలని అనుకుంటాడు. అతని ఆశలకు తగ్గట్టే హీరోయిన్ అతన్ని ప్రేమిస్తుంది. ఎవరికీ నచ్చని హీరోను ఈ హీరోయిన్ ఎలా ప్రేమించిందా అన్నదే కథలో ట్విస్ట్. హీరోయిన్‌లోని మరో కోణం బయటకు రావడంతో హీరో భయపడి పారిపోవాలని అనుకుంటాడు. ఆమెని చూసి ఎందుకలా పారిపోవాలని అనుకున్నాడన్నది తెలుసుకోవాలంటే సినిమా చూడాల్సిందే' అని చెప్పారు దర్శకనిర్మాతలు.



ప్రియదర్శి హీరోగా మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శ్రీదేవి మూవీస్ అధినేత శివలెంక కృష్ణప్రసాద్ నిర్మిస్తున్న చిత్రం 'సారంగపాణి జాతకం'. సోమవారం ప్రియదర్శి పుట్టినరోజు కావడంతో సెట్‌లో వేడుక నిర్వహించారు. చాలా రోజుల తర్వాత పుట్టిన రోజుని సెలబ్రేట్ చేసుకుంటున్నాననీ, గొప్ప వ్యక్తుల మధ్య ఇలా జరుపుకోవడం ఆనందంగా ఉందని ప్రియదర్శి అన్నారు.

హిందువులేనా అని అడిగారు



కృష్ణాష్టమి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేసుకునేందుకు మధురైలోని మీనాక్షి అమ్మవారి ఆలయానికి వెళ్లిన నటి నమిత దంపతులకు అవమానం ఎదురైంది. ప్రముఖుల దర్శన క్యూలైన్లో వెళ్ళిన వారిని ఆలయ సిబ్బంది అడ్డుకున్నారు. వీఐపీలు దర్శనానికి వస్తే వారి వివరాలను రిజిస్టర్‌లో పొందుపరచాల్సి ఉందని పేర్కొన్న సిబ్బంది.. 'మీరు హిందువేనా?' అని అడిగారు. తామిరువురమూ హిందువులమేనని, తమ కుమారుడికి శ్రీకృష్ణుడి పేరే పెట్టామని వారు వివరించారు. హిందువు అయితే నుదుట కుంకుమ పెట్టుకుని రావాలని ఆ సిబ్బంది నమితకు సూచించారు. ఆ మేరకు నమిత నుదుట కుంకుమ పెట్టుకుని ఆలయంలోకి వెళ్లి దైవదర్శనం చేసుకున్నారు. అనంతరం నమిత దంపతులు మీడియాతో మాట్లాడుతూ.. మీనాక్షి ఆలయ సిబ్బంది దురుసుగా వ్యవహరించారని, తాము హిందువులమని ధ్రువీకరించేందుకు సర్టిఫికేట్ అడిగారని తెలిపారు. నమిత మాట్లాడుతూ.. మొట్టమొదటిసారిగా తాను హిందూమతానికి చెందినదానిని నిరూపించుకోవాల్సిన అవసరం ఏర్పడిందని పేర్కొన్నారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

మీ టూ అంటూ ముందుకు వస్తున్న హీరోయిన్లు

● మలయాళ చిత్ర పరిశ్రమను కుదిపేస్తున్న జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్

ఒకప్పుడు మలయాళ చిత్ర పరిశ్రమ అంటేనే బూతు సినిమాలు.. చవకబారు సినిమాలు.. అనే తేలిక అభిప్రాయం ఉండేది. కేరళలోనే కాదు ఇతర భాషల్లోనూ మలయాళ చిత్రాలకు మంచి డిమాండ్ ఉండేది. భాష తెలియకపోయినా ఆ సినిమాల్లోని సీన్లకోసం ప్రేక్షకులు ఎగబడే వారు.. మమ్ముట్టి, మోహన్‌లాల్ వంటి హీరోలు ఉన్నా షకీలా లాంటి శృంగార తారలు అప్పట్లో ఒక వెలుగు వెలిగారు. వారి సినిమాల కంటే షకీలా సినిమాలే ఎక్కువ కలెక్ట్ చేసేవి. అయితే క్రమేపీ ఆ ముద్ర నుంచి బయటపడింది మలయాళ చిత్ర పరిశ్రమ. కొత్త రకం కథలతో.. సహజత్వం ఉట్టిపడే సినిమాలతో మిగతా అందరి దృష్టినీ ఆకర్షించగలిగింది. అంతే కాదు ప్రయోగాత్మక చిత్రాలు, కాన్సెప్ట్ ఓరియంటెడ్ ఫిల్మ్ కోసం మలయాళం సినిమాలే చూడాలి అనే స్థాయికి ఎదిగిందీ పరిశ్రమ. అవార్డులతో పాటు రివార్డులూ పొందింది. అయితే 2017లో జరిగిన ఓ సంఘటన మలయాళ చిత్ర పరిశ్రమ ప్రతిష్ఠను దెబ్బ తీసింది. తెలుగు వారికీ పరిచయమైన హీరోయిన్ భావనపై జరిగిన లైంగిక దాడి అందరినీ షాక్‌కు గురి చేసింది. ఈ దాడి దేశవ్యాప్తంగా అందరి దృష్టినీ ఆకర్షించింది. అదే సమయంలో బాలీవుడ్ నటి తనుశ్రీ దత్తా ముందుకు వచ్చి, 2008లో నటుడు నానా పాటేకర్ తనతో అసభ్యకరంగా ప్రవర్తించాడని వెల్లడించి ఇండియాలో 'మీ టూ' ఉద్యమానికి నాంది పలికింది. ఇక అప్పటి నుంచి ఈ ఉద్యమం మిగిలిన చిత్ర పరిశ్రమలకూ పాకింది. లైంగిక వేధింపులను బట్టబయలు చేసింది. ఉప్పెనలా ఎగసిన ఈ ఉద్యమం అప్పట్లో చాలా మందికి నిద్ర పట్టకుండా చేసింది,

అప్పటి నివేదిక ఇప్పుడు వెలుగులోకి..

మలయాళ చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందికర పరిస్థితులను ఏడేళ్ల పాటు పరిశీలించి, జస్టిస్ హేమ కమిటీ ఇటీవల ఇచ్చిన నివేదిక ఇప్పుడు ఆ పరిశ్రమను కుదిపేస్తోంది. మళ్లీ ధైర్యంగా హీరోయిన్లు ముందుకు వచ్చి, తమపై లైంగిక దాడికి ప్రయత్నించిన వారి చిట్టా బయట పెడుతున్నారు.

ఐదేళ్ల కెరీర్ కోల్పోయా



చిన్మయి

"ఉమెన్ ఇన్ సినిమా కలెక్టివ్ నిర్ణయం వల్లే ఈ కమిటీ నివేదిక సాధ్యమైంది. ఇప్పటివరకూ ఇలాంటిది ఏ పరిశ్రమలోనూ జరగలేదు. ప్రతీ ఇండస్ట్రీలో ఇలాంటి పరిస్థితులు ఉంటాయనేది బహిరంగ రహస్యం. సినీ పరిశ్రమలో లైంగిక వేధింపులు సాధ్యమని అందరూ భావిస్తుంటారు. ఇలాంటి ఘటన జరిగిందని చెప్పినా నిందితులపై వెంటనే చర్యలు తీసుకోవడం లేదు. కొన్నేళ్లపాటు కేసు నడుస్తూనే ఉంటుంది. రాజకీయ బలం, డబ్బు వల్ల ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిని శిక్షించడం కష్టంగా మారింది" అని చిన్మయి ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె గతాన్ని గుర్తుచేసుకున్నారు. "తమిళ చిత్ర పరిశ్రమకు చెందిన ఓ ప్రముఖ వ్యక్తి నాతో అభ్యంతరకరంగా ప్రవర్తించాడు. ఆయన గురించి బయటకు వచ్చి ధైర్యంగా మాట్లాడినందుకు నాకు ఆ పరిశ్రమలో వర్క్ లేకుండా చేశాడు. కాగా, విదేశాల్లో ఓ సంగీత కార్యక్రమం నిమిత్తం వెళ్లినప్పుడు సీనియర్ గీత రచయిత వైర ముత్తు తనని వేధింపులకు గురి చేశారని 'మీటూ' ఉద్యమ సమయంలో ఆమె కామెంట్స్ చేశారు. ఆయన చెప్పిన మాటలు విననందుకు తన కెరీర్ పైనే దెబ్బ కొట్టారని చిన్మయి ఆరోపించారు. ఈ క్రమంలోనే తమిళ పరిశ్రమ చిన్మయిని దాదాపు ఐదేళ్లు బ్యాన్ చేసింది. నిషేధం తర్వాత ఆమె 'లియో' చిత్రంలో త్రిష పాత్రకు డబ్బింగ్ చెప్పారు.

నాతో అసభ్యంగా ప్రవర్తించాడు



శ్రీలేఖ



రంజిత్ బాలకృష్ణన్

బెంగాలీ నటి శ్రీలేఖ మిత్ర మలయాళ చిత్ర దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్‌పై ఆరోపణలు చేశారు. 2009లో రంజిత్ దర్శకత్వం వహించిన "పలేరి మాణిక్యం: ఒరు పతిర కోలపతకతింటే కథ" సినిమా ఆడిషన్ సందర్భంగా తనతో అసభ్యంగా ప్రవర్తించినట్లు వెల్లడించారు. "నాకు సినిమా అవకాశం ఇస్తానని, సినిమా గురించి చర్చించేందు దర్శకుడు రంజిత్ నన్ను హోటల్ గదికి రమ్మన్నారు. గదిలోకి వెళ్లిన తర్వాత నాతో అసభ్యంగా ప్రవర్తించడంతో షాక్ గురై అక్కడ నుంచి బయటకు వచ్చేశాను" అని ఆరోపించారు. ఈ ఆరోపణల నేపథ్యంలో మలయాళ దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్ కేరళ చలనచిత్ర మండలి అధ్యక్షుడి పదవికి రాజీనామా చేశారు. "నటి శ్రీలేఖ నాపై చేస్తున్న ఆరోపణలు వాస్తవం కాదు. నిజానికి ఈ విషయంలో అసలు బాధితుడ్ని నేను. నాపై వెల్లువెత్తుతున్న ఆరోపణల నేపథ్యంలో నేను ఈ పదవిలో ఉండటం సముచితం కాదు. నాపై వస్తున్న ఆరోపణలను నేను లీగల్‌గా ఎదుర్కొని.. నా తప్పు లేదని నిరూపించుకుంటా" అని ఓ టెలివిజన్ చానల్‌కు పంపిన ఆడియో రికార్డ్‌లో పేర్కొన్నారు.

వేధింపులు ఎదుర్కొన్నా



మీను మునీర్

మరో మలయాళి నటి మీను మునీర్ తనకు జరిగిన ఓ చేదు అనుభవాన్ని సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. "మలయాళ పరిశ్రమకు చెందిన నటులు ముఖేశ్, మణియన్‌పిళ్ల రాజు, ఇడవేల బాబు, జయసూర్య, ప్రొడక్షన్ కంట్రోలర్ నోబల్, విచు వల్ల నేను ఎంతో మానసిక క్షోభ అనుభవించాను. వారు అసభ్యపదజాలంతో నన్ను దూషించేవారు. షూటింగ్ సమయంలో జయసూర్య నా వెనుకనుంచి బలవంతంగా హత్తుకుని, ముద్దుపెట్టుకున్నాడు. ఇవన్నీ తట్టుకోలేక నేను మలయాళ ఇండస్ట్రీని వదిలి చెన్నైకు వచ్చేశా. నాకీ విషయంలో న్యాయం జరగాలని కోరుకుంటున్నాను. వారు చేసిన పనికి తగిన శిక్ష పడాలి" అని పేర్కొన్నారు.

నా దృష్టిలో సిద్దిఖీ.. ఓ క్రిమినల్



సిద్ధిఖీ



రేవతి సంపత్

మలయాళ నటుడు సిద్ధిఖీ తనతో అసభ్యంగా ప్రవర్తించారని మలయాళ నటి రేవతి సంపత్ ఆరోపణలు చేశారు. "కొన్నేళ్ల క్రితం నటుడు సిద్ధిఖీ.. ఓ సినిమా కోసం నన్ను కలవాలని ఫేస్‌బుక్‌లో మెసేజ్ పెట్టారు. కూతురనే అర్థం వచ్చేలా ఆయన పిలవడంతో నేను ఆయనని సంప్రదించా. ఆయన నన్ను శారీరకంగా, మానసికంగా బాధించారు. నా దృష్టిలో ఆయనొక క్రిమినల్. దీని వల్ల నా కెరీర్ కూడా దెబ్బతింది. ఇప్పటికి ఈ విషయంపై మాట్లాడ్డానికి ధైర్యం వచ్చింది" అని పేర్కొన్నారు. ఈ ఆరోపణల నేపథ్యంలో సిద్ధిఖీ మలయాళ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ పదవికి రాజీనామా చేశారు.

ఇండస్ట్రీలో లేకుండా చేస్తానన్నారు



గీతా విజయన్



తులసీ దాస్

నటి గీతా విజయన్ మలయాళ చిత్ర దర్శకుడు తులసీ దాస్‌పై ఆరోపణలు చేశారు. "చంచట్టం' సినిమా షూటింగ్‌లో తులసీ దాస్ నాతో అసభ్యంగా ప్రవర్తించారు. నేనుండే రూమ్ తలుపు కొడుతుండేవాడు. నేను ఆ పద్ధతిని తప్పుపట్టినందుకు షూటింగ్‌లో ఆయన నాకు డైలాగులు చెప్పేవారు కాదు. ఇండస్ట్రీలో లేకుండా చేస్తానని బెదిరించేవారు" అని గీత ఆరోపించారు.

ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు తప్పుకోవాలి



పృథ్వీరాజ్

హేమ కమిటీ నివేదికపై.. మలయాళ పరిశ్రమలోని ప్రముఖులపై వెల్లువెత్తుతున్న ఆరోపణలపై నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ స్పందించారు. "అధికారంలో ఉండి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు పదవుల నుంచి తప్పుకోవాలి. నిందితులపై విచారణ జరిపి.. దోషులని తేలితే కఠినంగా శిక్షించాలి. ఈ నివేదికలో వెల్లడించిన అంశాలు నాకు ఆశ్చర్యం కలిగించలేదు. ఎందుకంటే పరిశ్రమలో మహిళలకు సురక్షిత వాతావరణం కల్పించడం మన కనీస బాధ్యత. అందుకు నేను ముందుంటా. అయితే అది నా ఒక్కడి బాధ్యత కాదు. అందరూ ఈ పద్ధతిని అనుసరించాలి" అని పేర్కొన్నారు.

జస్టిస్ హేమ కమిటీ... నివేదిక

2017లో నటి భావనపై కొందరు దుండగులు కారులో లైంగిక దాడికి పాల్పడిన సంఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. కారులో ఆమెను పలు చోట్లకు తిప్పుతూ దుండగులు అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఆ ఘటనలో మలయాళ అగ్రహీరో దిలీప్ కీలక నిందితుడు. ఆ సంఘటన తర్వాత మలయాళ పరిశ్రమలో మహిళలపై వేధింపులకు సంబంధించి నివేదిక ఇవ్వాలని 2019లో అప్పటి ప్రభుత్వం జస్టిస్ హేమ కమిటీని ఏర్పాటు చేసింది. మాజీ హైకోర్టు న్యాయమూర్తి కే.హేమ ఈ కమిటీకి ఛైర్ పర్సన్‌గా ఉన్నారు. సీనియర్ నటి శారద, ఐఏఎస్ అధికారిణి కేబీ వల్సల కుమారి సభ్యులుగా ఉన్నారు. కమిటీ తమ నివేదికను నాలుగేళ్ల క్రితమే ప్రభుత్వానికి సమర్పించినా, సున్నితమైన అంశాలున్నాయనే సాకుతో అందులోని విషయాలు బయటక రాకుండా ఇన్నాళ్లూ ప్రభుత్వం తొక్కిపట్టింది. సమాచార హక్కు చట్టం కింద బయటకు వచ్చిన ఈ నివేదికలో పలు విస్తుగొలిపే విషయాలు బయటకు వచ్చాయి. నివేదిక ఇచ్చి నాలుగేళ్లయినా చర్యలు శూన్యమన్న ప్రతిపక్షాల విమర్శల నేపథ్యంలో కమిటీ సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. మహిళలపై వేధింపులను అడ్డుకునేందుకు ప్రత్యేక చట్టాన్ని తీసుకొస్తామని హామీనిచ్చారు. ఈ మేరకు ఓ స్పెషల్ కమిటీని కేరళ ప్రభుత్వం నియమించింది. ఈ స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)కు ఓ ఐ.ఏ.ఎస్ అధికారిణి ప్రాతినిధ్యం వహించనున్నారు.



వేదికపై కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు

పీవీజీ వ్యక్తిత్వం స్ఫూర్తిదాయకం

● స్ఫూర్తి ప్రదాత విజయనగరం మహారాజా పుస్తకావిష్కరణ

విజయనగరం (ఆంధ్రజ్యోతి)/ విజయనగరం రూరల్: పీవీజీ రాజు వ్యక్తిత్వం స్ఫూర్తిదాయకమని, ఆయన విధానాలు అనుసరణీయమని వక్తలు తెలిపారు. సోమవారం పీవీజీ రాజు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా విజయనగరం కోటలో స్ఫూర్తి ప్రదాత విజయనగరం మహారాజా పుస్తకాన్ని ఉత్తరాంధ్ర జిల్లాల్లోని ఎంపీలు, మంత్రులు, స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఆవిష్కరించారు. కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు మాట్లాడారు.

పీవీజీ రాజు పద్ధతులపై చర్చ: అచ్చెన్న




పీవీజీ రాజు వ్యక్తి, వ్యక్తిత్వం, దాతృత్వం స్ఫూర్తి దాయకమని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడు తెలిపారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా,ఆయన చేసిన సేవలు, అనుసరించిన పద్ధతులు, దానం గురించి చర్చించుకోవడం జరుగుతుందన్నారు. 108 ఆలయాలకు అనువంశిక ధర్మకర్తగా ఉన్న అశోక్‌ను కోర్టుల చుట్టూ తిప్పారన్నారు. పీవీజీ ఆశయాలకు ఆటంకం కలగకుండా మొక్కవోని దీక్షతో ముందుకు నడిపించడం అభినందనీయ మన్నారు.

విద్యా ప్రదాత: ప్రతిభాభారతి

ఉత్తరాంధ్ర జిల్లాల్లో పీవీజీ అందించిన సేవలు స్ఫూర్తి దాయకమని శాసనసభ మాజీ స్పీకర్ ప్రతిభాభారతి తెలిపారు. వెనుకబడినప్రాంతంగా ఉన్న విజయనగరం, విశాఖ , శ్రీకాకుళం జిల్లాలకు విద్యాప్రదాతగా పీవీజీని పేర్కొనవచ్చునన్నారు. మన్సాస్ సంస్థను ఏర్పాటుచేసి ఈ ప్రాంతంలో విద్యావంతులను తయారుచేసిన ఘనత పీవీజీకే దక్కుతుందన్నారు.

విలువలే ఊపిరిగా: కొండపల్లి



మా కుటుంబంలో మాతాత, మాబాబాయ్‌తోపాటు నేను కూడా మాన్సాస్ విద్యాసంస్థల్లోనే చదువుకున్నానని కొండపల్లి తెలిపారు. విలువలే ఊపిరిగా, విద్యేప్రామాణికంగా తీసుకుని పేద విద్యార్థులకు విద్యనందిండం వారికే చెల్లిందని చెప్పారు. తండ్రి అడుగు జాడల్లో అశోక్ మాన్సాస్ ద్వారా విద్యనందించడం అభినందనీయమన్నారు.

మనం చూసిన కర్ణుడు పీవీజీ: ఎంపీ సీఎం రమేష్



మనంపురాణాలు,ఇతిహాసాల్లో కర్ణుడు గురించి విన్నామని ఎంపీ సీఎం రమేష్ తెలిపారు. కానీ ప్రజలు నేరుగా పీవీజీ రాజు అనే ధాన కర్ణుడుని చూశారన్నారు. చదువు, పేదల ప్రగతి కోసం వేలాది ఏకరాలు దానం చేసిన మహమనిషి పీవీజీ రాజని కొనియాడారు. పీవీజీ ఆశయాలను కొనసాగిస్తున్న అశోక్, అదితి గజపతిరాజును నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు.

గిరిజనుల విద్యకోసం వేల ఎకరాలు: సంధ్యారాణి



శిబి చక్రవర్తి కంటే పీవీజీ రాజు అని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. పేద గిరిజనుల విద్యకోసం వేల ఎకరాలు పాచిపెంటలో దానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. చిట్టి గురువుల కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టింది కూడా అశోక్ గజపతి అన్నారు. నేడు దేశమంతా ఆ కార్యక్రమం చేపట్టడం అశోక్ పరిపాలన దక్షతకు అద్దం పడుతోందన్నారు. విజయనగరాన్ని విద్యా నగరంగా మార్చిన ఘనత పూసపాటి వంశీయులదేనని తెలిపారు. తాను కూడా ఇక్కడ మహిళా కళాశాలలో చదవుకున్నాని గుర్తుచేశారు.

. ఏటా ప్రతిభా పురస్కారాలు: ఎమ్మెల్యే అదితి



ప్రతి ఏటా విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల నుంచి, జిల్లాకు వంద మంది మంది చొప్పున విద్యార్థులను ఎంపిక చేసి ప్రతిభా పురస్కారాలను అలక్ నారాయణ, పీవీజీ, ఆనందగజపతిరాజు పేరిట అందజేయనున్నట్లు ఎమ్మెల్యే అదితిగజపతిరాజు తెలిపారు. మా తాత, మాన్నగారి ఆశయం ప్రతి గడపకు చేరిం దని, ఎంతోమంది పేద విద్యార్థులు విద్యనభ్యసించి ప్రయోజకులయ్యారని చెప్పారు. గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు కోసం వందల ఎకరాలు ఇచ్చామని, దీన్ని త్వరగా నిర్మించాలని రాష్ట్ర మంత్రి సంధ్యారాణిని కోరారు. విజయనగరంలోని మా కోట విలువ, చదువు కోసం దానంగా ఇచ్చి న వేల ఎకరాల విలువ ఎంతుంటుందని గతంలో ఓ విద్యార్థిని ప్రశ్నించారని ఎమ్మెల్యే గుర్తుచేశారు.

మనమంతా స్ఫూర్తిగా నిలబడాలి: ఎంపీ శ్రీభరత్



పీవీజీ రాజును అందరు దేవుడని చేసేస్తున్నారని, కానీ ఆయనో మహా మనిసి అని మర్చిపోకండని ఎంపీ విశాఖపట్నం లోక్‌సభ సభ్యుడు శ్రీభరత్ తెలిపారు. ఆయన సమాజానికి దానం, ధర్మం, మంచితో పాటు ఆస్తులు పోగుచేసుకోవటమేకాదు, అవి సమజానికి ఉపయోగడాపడాలన్న సందేహం అందించారని తెలి పారు. ఆయన్ను చూసి మనమంతా స్ఫూర్తిగా నిలబడాలని చెప్పారు. ఆయనలా మనం సమాజానికి ఉపయోగపడే పనులు చేయాలని కోరారు

విద్యాదాత పీవీజీ: పల్లా శ్రీనివాస్



విద్యాదాత పీవీజీ, అశోక్ గజపతిని టీడీపీరాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ కొనియడారు. అటువంటి వారిని కొంతమంది చరిత్రహీణులు ఐదేళ్ల ఇబ్బందులు పెట్టారని తెలిపారు. ఇటువంటి వంశానికి దేవుడే కాదు.. ప్రజలు, పార్టీ కూడా అండగా ఉంటుందని చెప్పారు.

కార్యక్రమంలో ఎమ్మెల్సీలు పాకలపాటి రఘువర్మ, వేపాడ చిరంజీవిరావు, కేంద్ర మాజీ మంత్రి కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి, కలెక్టర్ అంబేడ్కర్, జిల్లా న్యాయాధికారి కళ్యాణ చక్రవర్తి, ఎస్పీ వకుల్ జిందాల్, పార్వతీపురం-మన్యం కలెక్టరుతో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, వ్యాపార, వాణిజ్య సంస్థల ప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, సీనియర్ ఉపాధ్యాయులు, మాన్సాస్ విద్యా సంస్థల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిరిమానోత్సవానికి ఏర్పాట్లు చేయండి

● నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతా
● రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం రూరల్: పైడిమాంబ సిరిమానోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. సోమవారం విజయనగరంలోని మూడులాంతర్ల వద్ద ఉన్న చదురుగుడిలో పైడిమాంబను దర్శించుకున్నారు. ఈవో డీవీ ప్రసాదరావు, సూపరింటెండెంట్ ఏడుకొండలు, అర్చకులు, సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. టీడీపీ హయాంలోనే పైడిమాంబ సిరిమానోత్సవం రాష్ట్ర పండుగగా గుర్తింపు జరిగిందని గుర్తుచేశారు. వైసీపీ హయాంలో సిరి మానోత్సవానికి ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం నుంచి విదల్చలేదని ఆరోపించారు. ఈ ఏడాది సిరిమానోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లు వేగవంతం చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. సిరిమానోత్సవం రాష్ట్ర పండుగగా గుర్తించిన నేపథ్యంలో ప్రత్యేకంగా నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు చెప్పారు. కాగా మూడు లాంతర్లు వద్ద గల చదురుగుడిని, ఆలయ పరిసరాలను విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పరిశీలించారు. అనంతరం ఈవో కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. సాధారణ భక్తులకు పైడిమాంబ దర్శనం చేసుకునేందుకు ఏర్పాట్లు విస్తృతం చేయాలన్నారు. మరోవైపు ఆలయ విస్తరణకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసి, సకాలంలో అందిస్తే, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు చెప్పారు.

పారిశుధ్య సమస్యపై ప్రత్యేక దృష్టి..

విజయనగరం రింగురోడ్డు: పారిశుధ్య సమస్య వల్ల అనేక ఇబ్బందులు తలెత్తు తుండడంతో ప్రభుత్వాలు కూడా ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నాయని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విజయనగరంలోని మూడులాంతర్లు వద్ద ఉన్న పైడిమాంబ చదురుగుడి వద్ద స్వచ్ఛభారత్ కార్పొరేషన్ సహకారంతో నగరపాలక సంస్థకు వచ్చిన రెండు ప్రత్యేక వాహనాలను ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య సమస్యలేని నగరంగా విజయనగరాన్ని తీర్చిదిద్దే విధంగా కృషి చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ పారిశుధ్య సమస్య లేని నగరంగా విజయనగరాన్ని తీర్చిదిద్దేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని తెలిపారు. నగరపాలక సంస్థలో ప్రస్తుతం పాడైన వాహనాలను మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, ఎంహెచ్‌వో కొండపల్లి సాంబ మూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టరు బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



ఆలయం వద్ద ఏర్పాట్లపై చర్చిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

అనపర్తిలో దారుణ హత్య

● భార్యను డంబెల్‌తో మోది హతమార్చిన భర్త
● అనాథలైన ఇద్దరు ఆడపిల్లలు



అరుణకుమారి (ఫైల్)

అనపర్తి: తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో ఓ వ్యక్తి భార్యపై అనుమానంతో డంబెల్‌తో తలపై మోది హతమార్చాడు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన తుపాకుల సాయి, అరుణకుమారిలకు 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరు సుమారు పదేళ్ల క్రితం జీవనోపాధి కోసం అనపర్తి వచ్చి జీవనం సాగిస్తున్నారు. వీరికి పది, ఏడేళ్ల వయసున్న ఆడపిల్లలు ఉన్నారు. సాయి కోడుగుడ్ల వ్యాన్‌పై డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల భార్యపై అనుమానం పెంచుకున్నాడు. తరచు మద్యం తాగొచ్చి చిత్ర హింసలకు గురి చేస్తున్నాడు. సోమవారం ఇద్దరికీ ఘర్షణ జరిగింది. మద్యం మత్తులో ఉన్న సాయి ఎక్సర్‌సైజ్ చేసే డంబెల్‌తో తలపైన తీవ్రంగా మోదడంతో తీవ్ర రక్తస్రావమై ఆమెకు అక్కడికక్కడే మృతి చెందింది. సీఐ శివగణేష్, ఎస్‌ఐ శ్రీనునాయక్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

యువకుడి మృతదేహం స్వాధీనం

సాలూరు: సాలూరు పట్టణంలో గజపతినగరం మండలంలోని భూదేవిపేటకు చెందిన బక్కా తులసి (41) మృతదేహం గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలో కాంప్లెక్స్ సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ హోటల్ ఎదుట సోమవారం ఓ వ్యక్తి మృతి చెంది ఉన్నాడని సమాచారం మేరకు పోలీసులు వివరాలు సేకరించారు. గజపతినగరం మండలంలోని భూదేవిపేటకు చెందిన బక్కా తులసిగా గుర్తించారు. ఆయన కుటుంబ సభ్యులను విడిచిపెట్టాడు. మతిస్థిమి తం కోల్పోయి తిరుగుతున్నాడు. నిత్యం మద్యం సేవిస్తాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు పట్టణ సీఐ అప్పలనాయుడు కేసు నమోదు చేశారు. తులసికి భార్య నాగమణితో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విద్యుత్ వైర్ తగిలి ఒకరి మృతి

వీరఘట్టం: మండలంలోని తలవరంలో వావిలపల్లి సత్యంనాయుడు (67) విద్యుత్ వైరు తగిలిన ఘటనలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. పొలం పనులకు ఆదివారం ఉదయం సత్యంనాయుడు వెళ్లాడు. సాయంత్రమైనా రాకపోవడంతో భార్య వావిలపల్లి చంద్రమౌళి ఆందోళనతో గ్రామస్థులకు సమాచారం అందించింది.దీంతో గ్రామస్థులు పరిసర ప్రాంతాలను గాలించారు. విద్యుత్ స్తంభానికి ఉన్న ఎర్త్‌వైర్ పట్టుకొని మృతిచెందినట్లు గుర్తించి భార్యకు తెలియజేశారు. దీంతో భార్య చంద్రమౌళి సోమవారం ఉదయం ఫిర్యాదుచేయడంతో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ కళాధర్ తెలిపారు.

తండ్రీకుమారులకు కన్నీటి వీడ్కోలు

రేగిడి: ఉప్పరనాయుడువలసకు చెందిన తండ్రీకుమారులు కరణం రామకృష్ణ, కిరణ్‌కుమార్ అంత్యక్రియలు గ్రామంలో సోమవారం జరిగాయి. వీరిద్దరూ శ్రీకాకుళం జిల్లా రణస్థలం సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. మృతదేహాలు పోస్టుమార్టంఅనంతరం స్వగ్రామం చేరాయి. కుటుంబ సభ్యులు, అభిమానులు, సాయిభక్తులు కన్నీటి వీడ్కోలు పలికారు.

బస్సెక్కి.. కుప్పకూలిన రైతు

● విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు 108కు తరలింపు



పెంట తాతను కేజీహెచ్‌కు తరలిస్తున్న దృశ్యం

జామి: జామి దొండపర్తికి చెందిన ఓ రైతు బస్సులో కుదుపులకు కుప్పకూలిన సంఘటన చోటుచేసుకుంది. ఈమేరకు ఆయన్ను విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.క్షతగాత్రుడు, కుటుంబ సభ్యులు కథనం మేరకు.. జామి దొండపర్తికి చెందిన రైతు పెంటతాత తన అల్లుడుతో విశా ఖ కేజీహెచ్‌లో చికిత్సపొందుతున్న వ్యక్తిని చూసేందుకు సోమవారం బయలుదేరాడు. వీరు అలమండ వద్ద అనకాపల్లి డిపోకు చెందిన బస్సును పెందుర్తి వరకు వెళ్లేందుకు ఎక్కారు. బస్సు చివరి సీటులో ఇద్దరూ కూర్చొన్నారు. బస్సు వేగంగా వెళ్లడంతోపాటు గోతుల వద్ద కుదుపులకు పెంటతాత ఒక్కసారిగా బస్సులో కుప్ప కూలిపోయాడు.ఆ సమయంలో బస్సు డ్రైవర్ పెంట తాతను పెందుర్తి బస్టాండ్ వద్ద దించేసి వెళ్లిపోయాడు. పెంట తాత లేవలేని స్థితిలో ఉండడంతో ఆయన అల్లుడు 108 వాహనంలో కేజీహెచ్‌కు తీసుకు వెళ్లాడు. అక్కడ అవుట్‌పోస్టు పోలీసులకు ఫిర్యా దుచేసి ఆసుపత్రిలో చేర్చాడు. కాగా బస్‌డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడం వల్ల తమ మామయ్యా పెంట తాత కుప్పకూలిపోయాడని బాధితుడి అల్లుడు రంభ రమణ తెలిపారు. తమ వద్ద ఉన్న టిక్కెట్ ఆధారంగా రాష్ట్ర రోడ్డురవాణ సంస్థకు ఫిర్యాదుచేస్తున్నట్లు చెప్పారు.

గంజాయిపై ఉక్కుపాదం: సీఐ

రాజాం రూరల్: రాజాంప్రాంతంలో గంజాయి వినియోగంపై ఉక్కుపాదం మోపుతానని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపారు.ఇటీవల గంజాయి వినియోగం పెరగడంతో నియంత్రించేందుకు చర్యలుతీసుకోనున్నట్లు చెప్పారు. సోమవారం రాజాం టౌన్ సర్కిల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గంజాయి వినియోగం, విక్రయాలపై సమాచారం ఉంటే తనకు నేరుగా ఫోన్‌లో తెలియజేయాలని సూచించారు. రాత్రిపది గంటల తర్వాత అత్యవసరమైతే తప్ప ప్రజలు, యువకులు రోడ్డుపై సంచరిం చవద్దని కోరారు. పాన్‌షాపులు, హోటళ్లు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, వ్యాపార సంస్థలు రాత్రి పదిగంటలకే మూసివేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఏనుగుల గుంపును తరలించండి

రాజాం: వంగర మండలంలో తిష్టవేసిన ఏనుగుల గుంపును తరలించేందుకు చర్యలుతీసుకోవాలని రాజాం జనసేననాయకుడు కేవీ ప్రవీణ్ కోరారు. ఈ మేరకు మం గళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జనవాణి కార్యక్రమంలో ఎమ్మెల్యే బి.శ్రీనివాసరావును సోమవారం వినతిపత్రం అందజేశారు.

లేబర్‌కోడ్లు రద్దుచేయాలి

విజయనగరం దాసన్నపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అసంఘటిత రంగ కార్మికులకోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ డిమాండ్ చేశారు. కాంట్రాక్టు విధానం, లేబర్‌కోడ్లు రద్దు చేయాలని కోరారు. సోమవారం విజయనగరంలో డీసీఎంఎస్ కార్మికులతో కలిసి విశాఖలో సెప్టెంబరు ఒకటి నుంచి మూడో తేదీ వరకు జరగనున్న ఏఐటీయూసీ జాతీయ సమావేశాలకు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సమితి సమావేశాలు జయప్రదం చేసేందుకు కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చందక శ్రీను, రామకృష్ణ, మజ్జి రమణ పాల్గొన్నారు..

పశువుల సంతలు తనిఖీ చేయండి

జామి: జిల్లాలోని అన్ని పశువుల సంతల నిర్వహణపై కలెక్టర్ తనిఖీలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ కోరారు. సోమవారం జామిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని లోట్లపల్లి పశువుల సంతలో సదుపా యాలు కల్పించకుండా తెరిచే ఏర్పాట్లు చేయవద్దని కోరారు. ఇటీవల సంతకు సంబంధించిన సమావేశంలో మౌలిక సదుపాయాలపై అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. సమావేశంలో బీజేపీ మండలాధ్యక్షురాలు ఆదిలక్ష్మి, గోసమాఖ్య ప్రతినిధులు రూపవతి, కేవీఆర్ సత్యనారాయణ, గండికోట శాంతి, లీలాపు దేవి, రవికిరణ్,పత్రి అప్పారావు, నాని పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణా కేసులో ఇద్దరి అరెస్టు

శృంగవరపుకోట: గంజాయిను అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరిని శృంగవరపు కోట పోలీస్‌లు అరెస్టు చేశారు. ఈ మేరకు సోమవారం రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ గంగరాజు కథనం మేరకు... బొడ్డవర చెక్ పోస్టు వద్ద ఆదివారం మధ్యాహ్నం పోలీస్‌లు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో అరకు నుంచి వస్తున్న ఇద్దరు వ్యక్తుల వద్ద గంజాయి ఉండడంతో అదుపులోకి తీసుకున్నారు. వీరు కాకినాడకు చెందిన ఎం.ప్రజ్వల్, ఈతకోట నానిలుగా గుర్తించారు. వీరి వద్ద ఉన్న 2 కేజీల 400 గ్రాముల గంజాయిను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదుచేశారు.

యువ క్రీడాకారులకు సాయం

బొబ్బిలి: రక్షణ రంగం, పోలీసు తదితర శాఖల్లో ఉద్యోగార్థులైన వారందరికీ ప్రేరణ కలిగించే కార్యక్రమాలకు సంపూర్ణ సహకారం అందిస్తామని సీఐ కటకం సతీష్ కుమార్ తెలిపారు. వీరబొబ్బిలి స్పోర్ట్స్ క్లబ్ నిర్వాహకులు, కోచ్ రావు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో యువ క్రీడాకారులు సోమవారం సీఐని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. దశాబ్దాలుగా గ్రామీణ ప్రాంత యువకులకు ఉచితంగా క్రీడా శిక్షణ ఇస్తున్న కోచ్ శ్రీనివాసరావు సేవలను ఆయన కొనియాడారు.

యూపీఎస్ అంగీకరించేదిలేదు

● యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు విజయగౌరి



యూపీఎస్‌పై నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

బొబ్బిలి రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్‌ను (యూపీఎస్) ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించేదిలేదని యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు విజయగౌరి తెలిపారు. సోమవారం బొబ్బిలిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడు తూ రాష్ట్రాల్లో సీపీఎస్ రద్దు చేయాలని ఆందోళనలు చేస్తున్న సమయంలో కేంద్రప్రభుత్వం ఈ విధంగా ప్రకటించడం ఉద్యోగు లకు తీవ్రమైన నష్టం కలుగుతుందని తెలిపారు. జీపీఎస్, యూపీఎస్ అమలును ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్, కార్యదర్శి కేశవరావు పాల్గొన్నారు.

బొబ్బిలిలో పూర్వ విద్యార్థుల కలయిక

బొబ్బిలి: బొబ్బిలి ఆర్‌సీఎం హైస్కూల్‌లో 1999-2000 సంవత్సరం లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు సోమవారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను ఒకసారి నెమరు వేసుకున్నారు. రోజంతా సందడిగా గడిపారు. నాటి హెచ్‌ఎం, ఫాదర్ ఎస్.ప్రతాప్, ఉపాధ్యాయులు ఒమ్మి మోహన ప్రసాద్, రామారావు, శ్రీనివాసరావు, రాజమోహన్ తదితరులను సత్కరించారు

బుచ్చి అప్పారావు పేరు పునరుద్ధరించాలి

శృంగవరపుకోట: ఎస్.కోట, గంట్యాడ మండలాల సరిహద్దుల్లో ఉన్న తాటిపూడి జలాశయానికి జామి మండలానికి చెందిన స్వాతంత్ర సమరయోధుడు గొర్రిపాటి బుచ్చి అప్పారావు పేరును పునరుద్ధరిం చాలని పుణ్యగిరివెలమ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గొల్లు సూరిబా బు, కోశాధికారి యండ్ల చంద్రరావు, దొగ్గ వెంకటరావు, గూనూరి వెంకటరావు, బండారు నాయుడు, గంట్రేడ్డి పైడితల్లి, అల్లు సత్యనారా యణ కోరారు.ఈ మేరకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను సోమవారం విజయనగరంలో కలిసి వినతి పత్రం అందజేశారు.

నేడు రాచ్చెరువువలసలో గ్రామసభ

బొబ్బిలి రూరల్: మండలంలోని దిబ్బగుడ్డివలస సచివాలయంపరిధిలో గల రాచ్చెరువువలసలో మంగళవారం గ్రామసభ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా పలు పనులకు తీర్మానాలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొబ్బిలి రూరల్: బొబ్బిలిలోని 33/11కేవీ గ్రోత్ సెంటర్ సబ్‌స్టేషన్ పరిధిలో పనుల దృష్ట్యా సబ్‌స్టేషన్ నుంచి పట్టణానికి వచ్చే 11 కేవీ మల్లమ్మపేట ఫీడరు, బోజరాజపురం వాటర్ వర్క్స్ ఫీడరులో మంగళవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు బొబ్బిలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆవాల అనంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఐటీఐ కాలనీ, బోసునగర్ కాలనీ, మల్లమ్మపేట, ఇందిరమ్మ కాలనీ, రాజమహల్ ఏరియా పరిసర ప్రాంతాల్లో, గ్రోత్ సెంటర్, ఇండస్ట్రియల్ ఏరియా, వాటర్ వర్క్సుకు విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.ఇతర ప్రాంతాల నుంచి అవకాశం ఉన్న ఏరియాలకు విద్యుత్ సరఫరా చేస్తామని తెలిపారు.

గ్రంథాలయ భవనం ప్రారంభం

వంగర: బాగెమ్మపేటలో సామాజిక అభివృద్ధి కమిటీ విరాళాలతో నిర్మించిన గ్రంథాలయ భవనం సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా విద్యాసామాజిక అభివృద్ధి కమిటీ వ్యవస్థాపకుడు రెడిరామమూర్తినాయుడు మాట్లాడుతూ గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు మెటీరియల్ అందుబాటులోకి ఉస్తామని తెలిపారు.కార్యక్రమంలో న్యాయమూర్తి గంటవల్లభనాయుడు, న్యాయవాదులు రెడ్డివిజయ్‌కుమార్‌పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం

బొబ్బిలి రూరల్: బొబ్బిలి ఎంఈవో కార్యాలయం ఆవరణలో యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు పురస్కరించుకుని ఆ సంఘ రాష్ట్ర మహిళా సభ్యురాలు విజయగౌరి ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యుడు ప్రసన్న కుమార్ సోమవారం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు కె.కృష్ణదాస్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మి, కస్తూరి, ఉదయ్ కుమారి, ఎస్వీ రమణమూర్తి పాల్గొన్నారు.

పేదలకు భూపంపిణీ చేయాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ

బాడంగి: కోడూరు రెవెన్యూ పరిధిలోని పెత్తందారులు ఆక్రమించు కున్న భూము లను పేదలకు పంపిణీచేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ కోరారు. సోమ వారం కోడూరులో విజయవాడలో జరిగే భూ బాధితుల రాష్ట్ర సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా భూములను ఆక్రమించుకొని సాగుచేస్తున్నారని తెలిపారు. వీటిని గుర్తించి వారి నుంచి స్వాధీనం చేసుకొని భూమిలేని పేదలకు పంపిణీ చేసేందుకు రెవెన్యూ అధికారులు చొరవతీసుకోవాలని కోరారు.పార్టీ నాయకుడు అలమండ ఆనంద రావుమాట్లాడుతూ సదస్సుకు అధికసంఖ్యలో హాజరుకానున్నట్లు తెలిపారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి జగన్మోహన్

విజయనగరం దాసన్నపేట: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో శానిటేషన్ వర్కర్లకు బకాయిఉన్న ఐదు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జగన్మోహన్, ఆ సంఘ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కే బేగం, నందినీలు డిమాండ్ చేశారు. సోమవారం విజయనగరంలో విలేకరులతో మాట్లాడుతూ ఏప్రిల్ నుంచి వేతనాలు బకాయిలు చెల్లించాల్సిఉందని తెలిపారు. ఇచ్చే రూ.ఆరువేలు కూడా సకాలంలో ఇవ్వకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు. శానిటేషన్ వర్కర్లు ఫుల్‌టైం పనిచేస్తున్నా ఈఎస్‌ఐ, పీఎఫ్, మెటర్నటీ లీవులు, సిక్ లీవులు, యూనిఫాం, గుర్తింపు కార్డులు వంటి సౌకర్యాలు లేవని తెలిపారు. ప్రభుత్వ సెలవు దినాల్లో కూడా పనిచేస్తున్నారని చెప్పారు. కాగా సమస్యలపై ఎమ్మెల్యే ఈదితి గజపతిరాజుకి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఉమా, పార్వతీ, విజయమ్మ, శారద, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

బొబ్బిలి రూరల్: మెరుగైన యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల అధిక దిగుబ డులు సాధించవచ్చని మత్స్యశాఖ టెక్నికల్ కన్సల్టెంట్ ఎన్.నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం మండలంలోని గొర్లె సీతారాంపురంలో కాకినాడలోని నేషనల్ సెంటర్ ఫర్ సస్టైనబుల్ ఆక్వా ఫీల్డ్ మేనేజర్ రాము ఆధ్వర్యంలో సాగునీటి వనరుల్లో చేపలు, రొయ్యలను సాగు చేస్తున్న మత్స్యకార రైతులకు ఆక్వాకల్చర్‌లో మెరుగైన నిర్వహణ, పద్ధతులపై అవగాహన కల్పించ డం కోసం శిక్షణ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగునీటి వనరుల్లో చేపలు, రొయ్యలను సాగు చేస్తున్న రైతులు శిక్షణ ద్వారా మెలుకువలు నేర్చుకోవాలనితెలిపారు.కార్యక్రమంలో సర్పంచ్ జి.ఈశ్వరరావు, ఏహెచ్‌ఏ ఎస్. సింహాచలం, వీఏఏ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మదర్ థెరిసాకు ఘన నివాళి

బొబ్బిలి: బొబ్బిలి ఆకుల రెల్లివీధిలోసంఘ సేవకురాలు మదర్ థెరిసా జయంతి పురస్కరించుకుని రాష్ట్ర రెల్లి ఉపకులాల సంఘం అధ్యక్షుడు గండి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ● **బొబ్బిలి రూరల్:** బొబ్బిలి మునిసిపాలిటీలోని చిక్కాలవీధిలో మదర్ థెరిసా ఫౌండేషన్ కార్యదర్శి విజయకుమార్ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.



బొబ్బిలి: మదర్ థెరిసా విగ్రహానికి పూలమాలవేసి నివాళులరిస్తున్న నాయకులు

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

- ఉత్సాహంగా ఉట్టికొట్టే సంబరాలు
- గోపికాకృష్ణుల వేషధారణలో అలరించిన బాలబాలికలు

కృష్ణాష్టమి వేడుకలను జిల్లా వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం గోపాలకృష్ణుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, సంకీర్తనలు చేశారు. యువత కోలాటం, ఉట్టి కొట్టే సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. సాయంత్రం తిరువీధి ఉత్సవం నిర్వహించారు. బాలబాలికలు గోపికాకృష్ణుల వేషధారణలో అలరించారు.
(ఆంధ్రజ్యోతి బృందం)


పార్వతీపురంటౌన్: జగన్నాథపురంలో పూజలందుకుంటున్న శ్రీకృష్ణుడు


పాలకొండ: పట్టణంలో కొలువుదీరిన శ్రీకృష్ణుడు


పార్వతీపురం రూరల్..


భామిని: లివిరి గోపీనాథ ఆలయంలో..


కురుపాం: ఉట్టి కొడుతున్న చిన్నారులు


వీరఘట్టం: కూరాకులవీధిలో..


సాలూరు రూరల్: ఉట్టి కొడుతున్న చిన్నారులు

సమస్యల పరిష్కారమే ధ్యేయం

- మంత్రి సంధ్యారాణి
- ప్రజాదర్బార్‌కు వినతుల వెల్లువ


మంత్రికి వినతులు అందజేస్తున్న ప్రజలు

సాలూరు: సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చెప్పారు. పట్టణంలోని తన నివాసంలో సోమవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. సాలూరు నియోజకర్గంతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి ఆమెకు వినతులు వెల్లువలా వచ్చాయి. తమ గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాల భవనం పూర్తిగా మరమ్మతులకు గురైందని, గత ప్రభుత్వంలో నాడు-నేడు కోసం అనేక వినతులు ఇచ్చినా మెరుగుపరచలేదని పాచిపెంట మండలం దిగువగొట్టూరు గ్రామానికి చెందిన గిరిజనులు వినతిపత్రం అందజేశారు. రోడ్డు, తాగునీటి సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా మని తెలిపారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుని వేషధారణతో వచ్చి మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, ముఖీ సూర్యనారయణ, గుడేపు యుగంధర్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గిరిజన చట్టాలు పటిష్ఠంగా అమలు చేస్తాం

- ఎమ్మెల్యే జయకృష్ణ


ఎమ్మెల్యే జయకృష్ణను సన్మానిస్తున్న దృశ్యం

పాలకొండ: నియోజకవర్గంలో గిరిజన చట్టాలు పటిష్ఠంగా అమలు చేయడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ స్పష్టం చేశారు. సోమవారం సీతంపేటలోని సామాజిక భవనంలో వివిధ ఆదివాసీ సంఘాలు ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఆదివాసీ ప్రాంతాలకు రోడ్లు, మంచినీరు పూర్తి స్థాయిలో కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిడ్డిక తేజేశ్వరరావు, కె.సుబ్బారావు, బిడ్డిక శ్రీను, పాలక పురుషోత్తం, పాలక నారాయుడు, సవర తోట ముఖలింగం, హిమరిక పవన్, భాస్కరరావు, లక్ష్మీనారాయణ, నిమ్మక పాండురంగ తదితరులు పాల్గొన్నారు.

లారీ కంటైనర్ బోల్తా

- తప్పిన పెను ప్రమాదం


పాలకొండ-హడ్డుబంగి రహదారిపై బోల్తా పడిన కంటైనర్

పాలకొండ: సీతంపేట మండలంలోని ఇసుకగెడ్డ గ్రామ సమీపంలో పాలకొండ- హడ్డుబంగి ప్రధాన రహదారిపై సోమవారం భారీ లారీ కంటైనర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వాహనంలో ఉన్న వారితో పాటు ఎవరికీ ఏ ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. కానీ కంటైనర్ పడడంతో రోడ్డుపక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభం నేలకొరిగింది. లారీ వెనుక భాగంలో ఉన్న యంత్ర సామగ్రి టన్నుల కొద్దీ బరువు ఉండడంతో లారీ అదుపు తప్పి మలుపులో బోల్తా కొట్టిందని గ్రామస్థులు చెబుతున్నారు. లారీలో తరలిస్తున్న యంత్ర సామగ్రి పక్కకు ఒరిగి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడినప్పుడు అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ప్రమాద సమాచారం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ జగదీష్‌నాయుడు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికిగల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ నిలిచిపోకుండా పోలీస్ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

మదర్‌థెరిసాకు ఘన నివాళి


మదర్‌థెరిసా విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎస్ఐ పాపారావు

సీతానగరం (బలిజిపేట): మండల కేంద్రంలోని కోనేరుగట్టుపై ఉన్న మదర్‌థెరీసా విగ్రహానికి ఎస్ఐ పాపారావు, సత్యసాయి సమితి కన్వీనర్ వెలిది సుబ్బారావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సోమవారం మదర్‌థెరిసా జయంతి సందర్భంగా వీరు మాట్లాడుతూ సేవామూర్తి మదర్‌థెరిసా బాటలో మనమందరం నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇ.సంజీవ్‌నాయుడు, శ్రావణ్ కుమార్, గౌరీనాథ్, చందు, వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన నేత మాలతీదొర మృతి


మాలతీదొర భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నేత భంజ్‌దేవ్

సాలూరు రూరల్: గిరిజన నేత చోడిపిల్లి మాలతీదొర(45) సోమవారం జోగిందొర మెట్టవలసలో మృతిచెందారు. ఆయన గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. కొదమ పంచాయతీకి చెందిన ఆయన టీడీపీలో చురుగ్గా ఉండేవారు. అనేక గిరిజన సమస్యలపై పోరాడారు. వార్డు సభ్యుడుగా పనిచేసి గిరిజనులకు సేవలందించారు. ● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీభంజ్‌దేవ్ జోగిందొర మెట్టవలస వెళ్లి మాలతీదొర భౌతిక కాయాన్ని దర్శించి, నివాళుల ర్పించారు. తీళ్ల పోలినాయుడు, చోడవరపు గోవిందరావు, బి.నాయుడు తదితరులు భౌతికకాయాన్ని దర్శించారు. ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.అమర్‌నాథ్ సంతాపం తెలిపారు.

పొలం గట్లపై పంటలతో అదనపు ఆదాయం

గరుగుబిల్లి: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పొలం గట్లపై పలు రకాల కాయ గూరల పంటలు పండించడం వల్ల రైతులకు అదనపు ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని ప్రకృతి వ్యవసాయం మెంటర్ మరడాన అప్పల నాయుడు తెలిపారు. మండలంలోని నందివానివలస, తదితర గ్రామాల్లో ఆయన సోమవారం పర్యటించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు పొలం గట్లపై పలు రకాల పంటలు పండించేలా చర్యలు చేపడుతున్నారని చెప్పారు. పొలం గట్లపై మునగ, అరటి, బొప్పాయి, జామ, కరివేపాకుతో పాటు చిక్కుడు, వంగ, మిరప, తదితర కాయగూరలు పంటలు పండించేలా రైతులను ప్రోత్సహించా మని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో అధిక సంఖ్యలో రైతులు పంటలు పండించేలా తమ వంతు కృషి చేస్తున్నామని ఆయన చెప్పారు.

చిత్తశుద్ధితో పనిచేయండి

పార్వతీపురం టౌన్: ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పని చేయాలని 108 వాహనాల పర్యవేక్షణ మేనేజర్ మన్మథరావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రాసుపత్రిలో పార్వతీపురం, పాలకొండ ఆసుపత్రులకు సంబంధించి 108 వాహనాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల శిక్షణకు హాజరై మాట్లాడారు. ప్రస్తుత నూతన వైద్య విధానాలకు అనుగుణంగా విధులు నిర్వహించాలన్నారు. అంబులెన్స్‌లో ఉన్న మందులు, పరికరాలు ఎలా వినియోగించాలో తెలుసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రైవేటు ఆసుపత్రిపై చర్యలు తీసుకోండి

జియ్యమ్మవలస: బట్లభద్ర గ్రామానికి చెందిన తల్లీకూతుళ్ల మరణానికి కారణమైన ప్రైవేటు ఆసుపత్రి వైద్యునిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కె.మన్మథరావు, ఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆర్‌వీఎస్ కుమార్‌తో కూడిన బృందం సోమవారం బట్లభద్ర గ్రామాన్ని సందర్శించారు. బాధితులు మేరువ పరంధామను కలిసి ఓదార్చారు. కేవలం ప్రైవేటు ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యానికి వారు చనిపోయారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు నిర్ధారించిన తర్వాత వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చర్యలు తీసుకోకుండా వదిలేస్తే ముున్ముందు మరెంత మంది వారి నిర్లక్ష్యానికి మృత్యువాత పడతారో అనే విషయం కలెక్టర్ ఆలోచించాలని కోరారు. అనంతరం ఈ నెల 28న విజయవాడలో జరగనున్న భూ బాధితుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

విచారణ చేపట్టాలి


జియ్యమ్మవలస: బాధితుడిని పరామర్శిస్తున్న నాయకులు

పార్వతీపురం టౌన్: మన్యం జిల్లా కేంద్రంలో గల ప్రయివేటు ఆసుపత్రుల దోపిడీపై విచారణ చేపట్టాలని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు కె.మన్మథరావు, ఆర్‌వీఎస్ కుమార్‌లు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రయివేటు ఆసుపత్రుల్లో చికిత్స కోసం వెళుతున్న ప్రజల నుంచి లక్షలాది రూపాయలు దోచుకోవడమే కాకుండా రోగులను వివిధ పరీక్షల పేరుతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రయివేటు ఆసుపత్రులపై సమగ్ర విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిబంధనలు పాటించాలి

గరుగుబిల్లి: వాహనదారులు విధిగా నిబంధనలు పాటించాలని ఎస్ఐ పి.రమేష్ నాయుడు సూచించారు. సోమవారం సుంకి సమీపంలోని ఐటీడీఏ పార్కు ప్రాంతంలో వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఆటోలపై పరిమితికి మించి ప్రయాణికులను తరలించవద్దని హెచ్చరించారు. ● **పార్వతీపురంటౌన్:** ప్రతి ద్విచక్ర వాహన చోదకుడు హెల్మెట్ ధరించాల్సిందేనని సీఐ నారాయణరావు అన్నారు. సోమవారం పట్టణ శివారుల్లోని ఎస్‌వీడీ కళాశాల వద్ద ద్విచక్ర వాహన చోదకులకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. ఇక నుంచి హెల్మెట్ ధరించని వాహన చోదకులపై కఠిన చర్యలతో పాటు భారీ జరిమానాలు విధిస్తామన్నారు. ఈ ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ సంతోషి కుమారి పాల్గొన్నారు. ● **కురుపాం:** వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ షణ్ముఖరావు సూచించారు. సోమవారం కురుపాంలో హెల్మెట్ వినియోగంపై వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసులు పాల్గొన్నారు.


కురుపాం: అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ షణ్ముఖరావు


గరుగుబిల్లిలో ఎస్ఐ రమేష్‌నాయుడు..


పార్వతీపురం టౌన్‌లో సీఐ నారాయణరావు..

చీమలగూడలో మినీ రిజర్వాయర్ నిర్మించాలి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కేదారపురం పంచాయతీ సీమలగూడ వద్ద మినీ రిజర్వాయర్ నిర్మించాలని ఈ ప్రాంత గిరిజనులు కోరుతున్నారు. ఇక్కడ మినీ రిజర్వాయర్ నిర్మిస్తే సుమారు ఆరు వేల ఎకరాల గిరిజనుల భూమికి సాగునీరు అందుతుందని ఈ గ్రామస్థులు చెబుతున్నారు. ఈ సమస్యను కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి దృష్టికి తీసుకువెళ్లామని, ఆమె మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారని గ్రామస్థులు తెలిపారు. గతంలో ఇరిగేషన్‌శాఖ ఈ రిజర్వాయర్ నిర్మాణానికి సర్వే చేశారని, నిధులు లేని కారణంగా పనులు చేపట్టలేదన్నారు. ప్రస్తుతం ఈ పెద్దగడ్డ రిజర్వాయర్ నిర్మించినందున నీరు వృథాగా ఒడిశాకు వెళ్లిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

జీవిత లక్ష్యాన్ని సాధించాలి

భామిని: బాలికలు వారి జీవిత లక్ష్యాలను సాధించాలని హోళీక్రాస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కె.ప్రభుదాస్ కోరారు. సింగిడి కల్యాణ మండపంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా క్లబ్ సభ్యులు, సుమారు వంద మంది బాలికలు హాజరై ఒక్కొక్కరి భవిష్యత్తు అభి ప్రాయాలపై ప్రసంగించారు. తనకు అనుకూలమైన లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలని పలువురు పేర్కొన్నారు. అనంతరం కలకత్తాలో డాక్టర్‌పై అత్యాచారం, హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టకపోతే ఉద్యమిస్తాం

పాలకొండ: పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై అధికార యంత్రాంగం దృష్టి సారించకపోతే ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని పట్టణ పౌరుల సంఘం కన్వీనర్ దావాల రమణారావు హెచ్చరించారు. ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడారు. నగర పంచాయతీ కార్యాలయం ముందు చెత్తవేయడం పట్ల స్థానికులు వ్యతిరే కిస్తున్నారని అన్నారు. అధికారంలో ఉన్న పాలకులు దీనిపై పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఇసుక అక్రమ రవాణాపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలను పరిష్క రించడంలో లేదని ఆయన ఆరోపించారు. డంపింగ్‌యార్డు సమస్యపై పాలకులు కనీసం స్పందించకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు


పాడుబడిన బావి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గరుగుబిల్లి: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో జి.పైడితల్లి, ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావులు హెచ్చరించారు. సోమవారం పెద్దూరులో వీరు పర్యటించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రస్తు తం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. రహదారికి ఆనుకుని పాడుబడిన బావిని పూడ్చి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. దీనిపై స్పందించిన ఉప సర్పంచ్ తెర్లి యల్లంనాయుడు ప్రజలకు అసౌకర్యం కలగకుండా నేలబావిని పూడ్చిస్తామని అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సుభద్ర, తదితరులు పాల్గొన్నారు.

సవర భాష వలంటీర్లను రెన్యువల్ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

కురుపాం రూరల్: సవర భాష వలంటీర్లను రెన్యువల్ చేసి 3 నెలల వేతనం తక్షణం విడుదల చేయాలని యూటీఎఫ్ నాయకుడు తోట రమేష్ కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం కొండలేవిడి గ్రామంలో సవర భాష వలంటీర్లతో సమావేశమయ్యారు. ప్రభుత్వం వలంటీర్లను రెన్యువల్ చేయని పక్షంలో పోరాటం ఉధృతం చేస్తామన్నారు.

గిరిజన యువతకు నేవీ ఉద్యోగుల సాయం


యువతకు స్టడీ మెటీరియల్ ఇస్తున్న విశ్రాంత నేవీ ఉద్యోగులు

కురుపాం రూరల్: విశాఖపట్నానికి చెందిన మాజీ నేవీ ఉద్యోగులు దురుబిలి గ్రామానికి చెందిన గిరిజన యువతకు సాయం చేసేందుకు ముందుకు వచ్చారు. 80 ఇళ్లు ఉన్న దురుబిలి గ్రామంలో 53 మంది గిరిజన యువతీ యువకులు పోటీ పరీక్షలకు హాజరయ్యేందుకు సిద్ధమవుతున్నారు. ఎస్ స్వచ్ఛంద సంస్థ సెక్రటరీ షేక్ గౌస్ తనకు తెలిసిన వారికి సమాచారం ఇచ్చి సాయం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. దీనికి స్పందించిన విశ్రాంత నేవీ ఉద్యోగులైన షేక్ సిరాజుద్దీన్, నగష్, వి.బి.స్.ప్రతాప్, గంగాధర్‌లు దురుబిలి గ్రామానికి వచ్చి రూ.30వేలు విలువైన స్టడీ మెటీరియల్‌ను అందించారు.


ఊరేగింపులో మహిళల కోలాటం

వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి

ఒడిశా

రాయగడ: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను రాయగడలో సోమవారం శ్రీకృష్ణ విహారి యాదవ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, తిరువీధి నిర్వహించారు. ఊరేగింపులో కోలాటం, తప్పెటగుళ్లు, పులి వేషాలు అలరించాయి. రాణిగుడ ఫారంలోని బిజూకళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వేదిక వద్దకు పూజలు నిర్వహించి, భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. స్థానిక ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక, పురాధ్యక్షుడు మహేష్ పట్నాయక్, వివిధ పార్టీల ప్రతినిధులు, యాదవ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

విద్యకు ప్రాధాన్యం ఇవ్వండి

సాలూరు రూరల్: యువత విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని సాలూరు రూరల్ సీఐ పి.రామకృష్ణ సూచించారు. కోనవలసలోని బాలికలు, బాలుర జూనియర్ కళాశాలల్లో ఆయన సోమవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత డ్రగ్స్, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

కురుపాం రూరల్: కురుపాం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. రక్తదానానికి యువత ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

వీధుల పేర్లతో బోర్డులు

కురుపాం: కురుపాం మేజర్ పంచాయితీలో 15వ ఆర్థిక సంఘం నిధులతో కాలనీలు, వీధి పేర్లతో బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జి.సుజాత, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'పొలం పిలుస్తోంది'

పాలకొండ: ఈనెల 27 నుంచి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించనున్నట్టు సీతంపేట మండల వ్యవసాయ అధికారిణి పి.శ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు ప్రతిరోజూ రెండు రైతు సేవా కేంద్రాల్లో పర్యటించి రైతులకు సలహాలు, సూచనలు ఇస్తారని చెప్పారు. వీరితో పాటు శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో సందర్శించి రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తారని తెలిపారు.

నేడు వాహనాల వేలం

సాలూరు: పట్టణంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో మంగళవారం వివిధ కేసుల్లో పట్టుబడిన నాలుగు ద్విచక్ర వాహనాలను వేలం వేస్తున్నట్టు ఎస్ఈబీ అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనే అభ్యర్థులు ఆధార్‌కార్డుతో డిపాజిట్ డబ్బులు కట్టాల్సి ఉంటుందని చెప్పారు.

నూతన ఎస్ఐకి అభినందనలు

గరుగుబిల్లి: నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన పి.రమేష్‌నాయుడుకు బీజేపీ మండల నాయకులు అభినందనలు తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు తుమ్మగుంట శంకరరావు, పెదిరెడ్డి అశోక్, డి.వెంకట నాయుడు తదితరులు సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

సాలూరు రూరల్: శ్రావణ నాలుగో సోమవారం కావడంతో సాలూరులో శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాలూరు పంచముఖేశ్వర ఆలయం, ఉమారామలింగేశ్వర ఆలయం, నగేశ్వరస్వామి, కాశీ విశ్వేశ్వర ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు.


శివలింగానికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం